# పశు సంవర్ధక శాఖలో మరో 495 ఉద్యోగాలు

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధకలో 495 కొత్త ఉద్యోగాలకు, 194 ప్రస్తుత పోస్టుల స్థాయి పెంపు (అప్‌గ్రేడేషన్)కు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ శాఖలో మిగులుగా ఉన్న 96 పోస్టులను స్వాధీనం చేసుకొని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి, పునర్వ్యవస్థీకరించాలని పశు సంవర్ధక శాఖ చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖ సైతం ఆర్థిక పరమైన అనుమతి ఇచ్చింది. 2022కు రూ.లక్ష కోట్ల విలువైన పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి సాధించాలన్న లక్ష్యంలో భాగంగా సర్కారు ఈ మార్పులు చేసింది. కొత్త పోస్టుల్లో 430 పశు సంవర్ధక విభాగం, 65 జిల్లా లైవ్ స్టాక్ ప్రొడక్షన్ యూనిట్ కార్యాలయాలకు కేటాయించారు. వీటిల్లో 330 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు (క్లాస్–ఏ), 33 అసిస్టెంట్ డైరెక్టర్లు, 12 లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, 10 డిప్యూటీ డైరెక్టర్లు, 39 అసిస్టెంట్ డైరెక్టర్లు (లైవ్‌స్టాక్), 26 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (లైవ్‌స్టాక్) తదితర పోస్టులున్నాయి. 125 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లను అసిస్టెంట్ డైరెక్టర్లుగా, 65 మంది అసిస్టెంట్ డైరెక్టర్లను డిప్యూటీ డైరెక్టర్లుగా, నలుగురు డిప్యూటీ డైరెక్టర్లను జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తారు. పశుసంవర్ధక విభాగంలో మిగులుగా ఉన్న 96 పోస్టులను ప్రభుత్వానికి తిరిగి స్వాధీనం చేస్తారు.